ప్రజాశక్తి

ఆదివారం 10 మార్చి 2024 5 కర్నూలు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

బిజెపితో పొత్తుపై ఆందోళన

- మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమవుతాయని చర్చ - లాభనష్టాలపై టిడిపి నేతల్లో తర్జన భర్జన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు ఖరారైంది. దీనిపై టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమవుతాయని చర్చ సాగుతోంది. బిజెపితో పొత్తు ఎంత మేరకు లాభం చేకూరుస్తుంది? ఎంత మేరకు నష్టం చేకూరుస్తుంది? అన్న వాటిపై నేతల్లో తర్జన భర్జన నెలకొంది.

మొన్నటి వరకూ టిడిపి, జనసేన కూటమి ఇప్పుడు బిజెపితో జత కట్టింది. టిడిపి, జనసేన, బిజెపి కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. వాటికి సంబంధించి సీట్ల సర్దుబాటు కొనసాగుతోంది. ఇప్పటికే టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం టికెట్‌ను బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టికెట్‌ను టిజి.భరత్‌కు, పాణ్యం టికెట్‌ను గౌరు చరితారెడ్డికి, నంద్యాల టికెట్‌ను ఎన్ఎండి ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె టికెట్‌ను బిసి.జనార్ధన్‌రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. ఇంకా నందికొట్కూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు స్థానాలకు టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. పొత్తులో భాగంగా ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేనకు, బిజెపికి సీట్లు కేటాయించే పరిస్థితి లేదు. ఇప్పటికే సీట్లు ఖరారైన అభ్యర్థులు జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో భాగంగానే ఎన్నికల ప్రచారాం కూడా నిర్వహిస్తున్నారు. తాజాగా టిడిపి, జనసేన కూటమి బిజెపితో పొత్తు ఖరారు చేసుకోవడంతో టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమయ్యే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, కర్నూలు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీల ఓట్లు అధికంగా ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో దళితులు, క్రైస్తవుల ఓట్లు, కోడుమూరు నియోజకవర్గంలో దళితుల ఓట్లు అధికంగా ఉన్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాకా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలపై, క్రిస్టియన్లపై, దళితులపై దాడులు జరిగాయి. పలు సందర్భాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముస్లిములపై, మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరిగిన దారుణ మారణకాండలను ముస్లిం, క్రైస్తవ సంఘాలు ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. బిజెపికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయి. దీనికి తోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకపోవడంతో పాటు వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించలేదు. నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచేసింది. దీంతో బిజెపికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు పలు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాల ద్వారా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో కొన్ని వర్గాల ప్రజల్లో బిజెపి పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బిజెపితో టిడిపి, జనసేన పొత్తు వల్ల ఆ వ్యతిరేకత కూటమిపై పడే అవకాశం ఉందని, ఆయా వర్గాల ఓటర్లు దూరమయ్యే పరిస్థితి ఉందని చర్చ మొదలైంది. గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేనకు 1.7 శాతం ఓట్లు పడ్డాయి. బిజెపికి 1 శాతం ఓట్లు కూడా రాలేదు. అంత తక్కువ శాతంలో ఓట్లు ఉన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవడం తమకు ఏ మాత్రం లాభం? ఎంత వరకు నష్టం ? అని టిడిపిలోని మైనార్టీ నాయకుల్లో, దళిత నాయకుల్లో తర్జన భర్జన నెలకొంది.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వారంలో ఎప్పుడైనా రావచ్చని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎన్నికల విధుల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. నియోజకవర్గాల వారీగా నోడల్ అధికారులను నియమించుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత రోజూ వందలాది కమ్యూనికేషన్లు వస్తుంటాయని, వాటిని ఒక్కరే చూసుకోవాలంటే కష్టమని తెలిపారు. నియోజకవర్గాల వారీగా సబ్జెక్ట్‌కు ఒక నోడల్ అధికారిని నియమించుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. మెటర్నిటీ లీవ్, సీరియస్ హెల్త్ కండిషన్స్ ఉన్న వారికి పోలింగ్ విధుల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తూ, ఆరోగ్యం బాగా లేదని పోలింగ్ విధులకు మాత్రం 776 మంది మినహాయింపు కోరుతున్నారని చెప్పారు. వారికి మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి వారు చెప్పిన కారణం సరైనదా కాదా అని పరిశీలించాలన్నారు. ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటు చేస్తామని, అక్కడ దరఖాస్తు ఇస్తే ప్రతి కేసునూ పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మెటీరియల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఏ మెటీరియల్, ఎప్పుడు జిల్లాకు చేరిందనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి సెక్టోరియల్ అధికారులకు వాహనాలను రిటర్నింగ్ అధికారుల ద్వారా పంపించాలని సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ (స్వీప్)కు సంబంధించి అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ చాలా తక్కువగా నమోదవుతోందని, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు అర్బన్ ప్రాంతాల్లో కూడా స్వీప్ కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జెసి నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలి

- మతోన్మాద బిజెపిని ఓడించాలి
- రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడుకోవాలి
- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని దళిత్ సోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు జగ్గుల జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఎండి.ఆనంద్‌బాబు అధ్యక్షతన కర్నూలు ఎంపిపి హాల్‌లో 'దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలి..మత స్వేచ్ఛను, మత సామరస్యాన్ని కాపాడాలి' అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జాన్‌వెస్లీ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. మతోన్మాద బిజెపిని ఓడించి రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే దళితులకు, మైనార్టీలకు హక్కులుండవని, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడుతుందని, అసమానతలకు అది కేంద్ర బిందువుగా మారుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే ఎన్నికల సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. బిజెపితో రాజీపడే వాళ్లను ఎన్నుకుంటే కూడా ప్రమాదం ఏర్పడుతుందన్నారు. శూద్రులు, దళితులు చదువుకునే హక్కును మనుధర్మశాస్త్రం నిషేదించిందని, తిరగబడి పోరాడటం వల్లే దళితులకు కొన్ని హక్కులు వచ్చాయని తెలిపారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసి మనుధర్మశాస్త్రాన్ని రాజ్యాంగంగా అమలు చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ చెప్పిందే బిజెపి అమలు చేస్తోందని, మతం మారారు కాబట్టి దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించడానికి వీల్లేదని చెబుతున్నారని అన్నారు. మతం మార్చుకున్నా కులం మారదని, రంగనాథన్ కమిటీ, సచార్ కమిటీ దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని చెప్పారని తెలిపారు. కుల వ్యవస్థ ఉండాలని, రిజర్వేషన్లు ఉండకూడదని చెప్పే శక్తులను ఓడించాలన్నారు. మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే ఊచకోతలు కొనసాగుతాయన్నారు. మత మార్పిడిని వ్యతిరేకిస్తూ ఐదు రాష్ట్రాల్లో చట్టాన్ని తీసుకొచ్చారని, బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మత మార్పిడి నిషేద చట్టాన్ని కేంద్రంలో తెస్తారని తెలిపారు. దేశానికి, రాజ్యాంగానికి ప్రమాదం వచ్చినప్పుడు దానికి వ్యతిరేకంగా మాట్లాడకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలను నిలదీసే వైపుగా ఉద్యమించాలని, రాజ్యాంగాన్ని, హక్కులను కాపాడుకోవడం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సదస్సులో మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకులు కొమ్ముపాలెం శ్రీనివాస్. వేదికపై జాన్‌వెస్లీ

మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్, జయరాజు

రాజ్యాంగ వ్యతిరేకం

- ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు జయరాజు

ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు ఎగ్గోని జయరాజు మాట్లాడుతూ పేరును బట్టి సమాజంలో వివక్షకు గురి చేస్తున్నారని, అందరూ సమానమే అని చెబుతూ దళిత క్రైస్తవులు ఎస్సీలు కాదని చెప్పడం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. మతపరమైన దాడుల్లో అగ్రవర్ణాలు బలికావడం చూశామా అని ప్రశ్నించారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని కోరుతుంటూ సుప్రీం కోర్టులో దాన్ని సాగదీస్తున్నారని, మోడీ ప్రభుత్వం రంగనాథన్ కమిషన్ సిఫార్సులను పక్కన పెట్టి మళ్లీ కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారని వివరించారు. దేశంలో ఒకే వ్యవస్థ ఉండాలని దీర్ఘకాలిక కుట్ర జరుగుతోందన్నారు. న్యాయ వ్యవస్థను కూడా భ్రష్టుపట్టిస్తున్నారని, వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఇలాంటి భయానక పరిస్థితుల్లో మతోన్మాద శక్తులు రాజ్యాధికారానికి రాకుండా చూడాలన్నారు. ఏ విధంగా ఉండాలో కూడా ఆంక్షలు విధించే రోజులు రానున్నాయని, రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు.

జెండాను కూడా మార్చేందుకు ప్రయత్నం

- సామాజిక విశ్లేషకులు కొమ్ముపాలెం శ్రీనివాస్

సామాజిక విశ్లేషకులు కొమ్ముపాలెం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ఒకే దేశం, ఒకే మతం అంటోందని, జెండాను కూడా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. 340 ఆర్టికల్ వల్ల బిసిలకు రిజర్వేషన్లు వచ్చాయని, 20, 30 ఆర్టికల్స్ వల్ల మత స్వేచ్ఛ లభించిందని తెలిపారు. ప్రాథమిక హక్కులను మార్చేలా చట్టాలను తీసుకొచ్చారన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా కొనసాగించేందుకు ప్రభుత్వ వేసిన కమిటీకి మన అభిప్రాయాలు చేరేలా కృషి చేయాలన్నారు.

వారి వల్లే ప్రమాదంలో రాజ్యాంగం : గౌస్‌దేశాయ్

కర్నూలు సెక్యులర్ ఫోరం నాయకులు డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రాజ్యాంగం భారతదేశానికి పనికిరాదని చెప్పే వాళ్లు అధికారంలో ఉండటం వల్లే రాజ్యాంగం ప్రమాదంలో ఉందని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అనుసరించే విధానాలను గమనించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా దళితులు, మైనార్టీలు జీవించే పరిస్థితి లేకుండా చేస్తున్నారన్నారు. వర్ణ వ్యవస్థను కొనసాగించాలని పాలకవర్గం చూస్తోందని, దళితులు, మైనార్టీలు, గిరిజనులు, మేధావులకు రక్షణ కరువైందని తెలిపారు. అందరూ ఐక్యం కాకపోతే మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తారని, హక్కులను కాపాడుకోవడమే కాక, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే వారికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. సమావేశంలో సమావేశంలో కేపిబియస్‌యస్ చైర్మన్ జయకాంత్ క్రిస్టియన్, చర్చి బిషప్ మైఖేల్ టి మునేష్, రాజు, జాషువా డానియేల్ మాట్లాడారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు పిఎస్.రాధాకష్ణ, కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, పాస్టర్లు శ్రీకాంత్, యెహెూవా, సిస్టర్ దానమ్మ, ఆనందరావు, విజయమ్మ, విజయ్, నరసింహులు మరో 200 మంది పాల్గొన్నారు.

వడదెబ్బకు మహిళ మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

కర్నూలు జిల్లా సి బెళగల్ మండలం పోలకల్ లో గుడిపాడు కు చెందిన మహిళ బజారమ్మ శనివారం వడదెబ్బ సోకి మృతి చెందారు. గుడిపాడు నుండి మిరప కోత కూలి పనికి వచ్చింది. మధ్యాహ్నం వేళ వడగాలూలకు స్పృహ తప్పి పడిపోయింది. ఆసుపత్రికి తరలించేలోపు ప్రాణాలు విడిచింది.

11న కలెక్టరేట్లో స్పందన

కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 11న కలెక్టరేట్‌లో సమావేశ భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు

లైవ్ ఆర్థోస్కోపి సర్జరీ ని ప్రారంభిస్తున్న వైద్యులు

జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ లో లైవ్ ఆర్థోస్కోపి సర్జరీ

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ప్రపంచ అతిపెద్ద కంపెనీ స్మిత్ నెఫ్యూ వారి సహకారంతో రాయలసీమలో మొట్ట మొదటిసారిగా లైవ్ ఆర్థోస్కోపి సర్జరీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సిఇఒ డాక్టర్ ఎస్‌వి. చంద్రశేఖర్ , డాక్టర్ జివిఎస్.రవిబాబు, స్మిత్ నెఫ్యూ అకాడమీ మేనేజర్ గురు ప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ అర్థో స్కోపి వైద్యులు డాక్టర్ ప్రథమేష్ జైన్,డాక్టర్ చిరగ్ తొంసే , డాక్టర్ ప్రదీప్ కుమార్ చేత జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో తీవ్ర మోకాలు నొప్పి సమస్యతో ఇబ్బంది పడుతున్న ముగ్గురు రోగులకు రూ.లక్షల విలువ చేసే ఆర్థో స్కోపి సర్జరీని ఉచితంగా చేయించామన్నారు. లైవ్ స్క్రీన్లో ఆర్థోస్కోపి సర్జరీని రాయలసీమలోని 100 మంది యువ ఆర్థో స్కోపి వైద్యులకు అవగాహన పెంచుకోవాలని లైవ్ సర్జరీ ద్వారా వారి సందేహాలను తెలియజేస్తూ శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు చేసిన ఆపరేషన్ కొత్త వైద్య నైపుణ్యాలను యువ వైద్యులకు నేర్పించారు. ఇదంతా జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో అధునాతనమైన వైద్య పరికరాల వల్లే సాధ్యమైందని వారు తెలిపారు. ఇలాంటి అనేక ఆర్థోఃస్కోపి చికిత్సలు కర్నూలు నగరంలో డాక్టర్ రవిబాబు చేసిన అనుభవం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వారికి ఉందని తెలిపారు. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒ డాక్టర్ గణేష్, మార్కెటింగ్ డిజిఎం రమణబాబు, మార్కెటింగ్ జిఎం షేక్షావలి, హాస్పిటల్ ఆపరేషన్ హెడ్ నదీమ్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హడావుడి ఆరంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. వైసిపి నుంచి కర్నూలుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను, ఎమ్మిగనూరుకు బుట్టా రేణుకను, కోడుమూరుకు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను, ఆలూరుకు బుసినే విరూపాక్షిని, నందికొట్కూరుకు డాక్టర్ దారా సుధీర్‌ను ఆ పార్టీ అధిష్టానం నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. ఆ పార్టీ వారినే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా టిడిపి, వైసిపికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. టిడిపి అభ్యర్థులు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందులో భాగంగానే ఎన్నికల ప్రచారం కూడా చేస్తున్నారు. టిడిపి అభ్యర్థుల్లో ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ, బనగానపల్లెలో బిసి.జనార్ధన్ రెడ్డి, కర్నూలులో టిజి.భరత్, పత్తికొండలో కెఇ.శ్యాంబాబు, శ్రీశైలంలో బుడ్డారాజశేఖర్ రెడ్డి, పాణ్యంలో గౌరు చరిత రెడ్డి, నంద్యాలలో ఎన్ఎండి.ఫరూక్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో సభలను కూడా నిర్వహించారు. వైసిపి అభ్యర్థుల్లో ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్ కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు పట్టాలు పంపిణీ చేసే ప్రభుత్వ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. కోడుమూరులో డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఆలూరులో బుసినే విరూపాక్షి, నందికొట్కూరులో దారా సుధీర్, ఎమ్మిగనూరులో బుట్టా రేణుక, జోరుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థులుగానే ఏకంగా ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అభ్యర్థులా ఇన్‌ఛార్జులా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను ప్రారంభించారు.

అవీ..ఇవీ..అన్నీ..

జిల్లా వ్యాప్తంగా పోలియో ఆదివారం నిర్వహించారు. పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో ఆదివారం విజయవంతానికి ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఇన్‌పుట్ సబ్సిడీ నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, కాల్వబుగ్గ, ఓకారంతో పాటు అన్ని ప్రాంతాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

హైకోర్టు సీనియర్ అడ్వకేట్ కు పుత్రిక వియోగం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు వాసి హైకోర్టు సీనియర్ అడ్వకేట్ ఆర్. రామాంజనేయులు, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎం.ఆశీర్వాదమ్మ దంపతులకు పుత్రిక వియోగం కలిగింది. వారి పుత్రిక ఆర్. సౌమ్య(38) గురువారం రాత్రి అనారోగ్యానికి గురి కావడంతో కర్నూలు నగరం, గాయత్రి ఎస్టేట్ లోని విశ్వభారతి హాస్పిటల్‌లో చేరించారు. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమె కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. పిజి సీటు కోసం శ్రమిస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో అనుకోకుండా హార్ట్ స్ట్రోక్ కు గురి కావడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

మతురాలు కుటుంబానికి పలువురు పరామర్శ

హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రామాంజనేయులు కూతురు సౌమ్య మరణ వార్త తెలుసుకున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పి.రాధాకష్ణ, ఐలు రాష్ట్ర అధ్యక్షులు కె. కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. వెంకట స్వామి, బార్‌సోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్.లక్ష్మణ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ తోపాటు పలువురు ప్రముఖులు మృతురాలి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు లో శనివారం రోజు ఉపాధి పనుల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జిపి వీరన్న పాలకుర్తి రోడ్డులో కాలువ పూడిక తీస్తూ ఉన్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ.200 కూలి మాత్రమే పడుతున్నాయని, ఆరువారాలైనా వేతనాలు రాలేదని వివరించారు. అసలే పనులు లేని కాలంలో ఈ ఉపాధి పనులు చేస్తే వారి కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందని పనులకు వెళ్తున్నామని వారన్నారు.గడ్డపారకు కొలిమి కొరకు రూ.20 , మంచినీళ్లకు రూ.ఐదు వేసవికాలంలో మజ్జిగ ప్యాకెట్లు ఎండాకాలంలో టెంట్లు వేయాలని, రూ.200 రోజులకు ఉపాధి పని దినాలు పెంచాలని, రోజు కూలి రూ.600 పడేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారన్నారు.

కర్నూలులో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్‌పి

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు రెండవ పట్టణ పోలీసులు కర్నూలు పట్టణంలో కవాతు నిర్వహించారని జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు-2024 దృష్టిలో ఉంచుకొని కర్నూలు డిఎస్‌పి కె.విజయ శేఖర్, ట్రైన్ డిఎస్‌పి భావన, కర్నూలు టూ టౌన్ సిఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో కర్నూలు సబ్ డివిజన్ , కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి కొత్తపేట, కొండారెడ్డి బురుజు, కోర్ట్ కాంప్లెక్స్, చిరంజీవి పార్క్, మున్సిపల్ ఆఫీస్, ప్రకాష్‌నగర్ మీదుగా కవాతు నిర్వహించారు. కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసు అధికారులు కవాతు నిర్వహిస్తూ, పట్టణ ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడానికి ప్రధాన కారణం ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి 100 మంది కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు.

భక్తులకు పండ్లు పంపిణీ చేసిన ఇంతియాజ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు సంకల్ బాగ్ సమీపంలో ఉన్న భవాని రామలింగేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు కర్నూలు అసెంబ్లీ వైసిపి అభ్యర్థి ఎఎండి ఇంతియాజ్ పండ్లను పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు రాజకీయాలలోకి రాకముందునుంచే రెగ్యులర్‌గా కోడుమూరు, కర్నూలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, నాయకులు

క్రైస్తవుల సంక్షేమానికి కృషి

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రైస్తవుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని వైసిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, వైసిపి ఎమ్మిగనూరు ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. శనివారం పట్టణంలోని కర్ణి కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు తాలూకా పాస్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా హాజరయి మాట్లాడారు. నాలుగున్నర ఏళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి క్రైస్తవులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ప్రభుత్వం పాస్టర్లకు రూ.5 వేలు గౌరవ వేతనం అందిస్తోందని చెప్పారు. ఎన్నికల్లో తన గెలుపునకు పాస్టర్లు, క్రైస్తవ, మైనార్టీలు సహకరించాలని కోరారు. బుట్టా శివనీలకంఠ, వైసిపి సీనియర్ నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, వైసిపి పట్టణ అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం వైసిపి ప్రభుత్వానికి రెండు కళ్లు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని బుట్టా రేణుక పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డు బోయప్ప గుడిలో స్వామివారిని ప్రత్యేక దర్శనం చేసుకొని అనంతరం వార్డులో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తనూ కలుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ, ప్రజలకున్న సమస్యలు వింటూ, హామీలు ఇస్తూ ముందుకు సాగారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరులో వైసిపి జెండాను ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతూల్, 2వ వార్డు కౌన్సిలర్ అంపమ్మ, 1వ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప, కౌన్సిలర్ అమానుల్లా, మైనార్టీ నాయకులు ఖయ్యూం, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వగరూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శ్రీకారం చుట్టారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కటిక, మైనార్టీ కాలనీ, వాల్మీకి కాలనీ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో రూ.40 లక్షలతో తాగునీటి పైపులైన్, రోడ్లకు, రూ.3.50 లక్షలతో ఎస్సీ కాలనీ ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి వైసిపి మండల ఇన్‌ఛార్జీ సి.విశ్వనాథ్ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం'లో మాట ఇచ్చారని, ప్రస్తుతం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జగనన్న కాలనీల్లోని 96 మంది లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచి లింగారెడ్డి, ఎంపిటిసి చిన్నన్న పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న విశ్వనాథ్‌రెడ్డి

విఆర్ఎకు భీమిరెడ్డి పరామర్శ

- రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విఆర్ఎ నరసయ్యను వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి పరామర్శించారు. శనివారం కర్నూలు నగరంలోని మైక్యూర్ (మెడికవర్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విఆర్ఎ నరసయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో వేర్వేరుగా ఫోన్‌లో విఆర్ఎ నరసయ్యతో మాట్లాడించగా వారు విఆర్ఎ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును అందించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విఆర్ఎను పరామర్శిస్తున్న భీమిరెడ్డి

ముందస్తు అరెస్టులు తగదు

- వికలాంగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్

ప్రజాశక్తి ఆదోని

సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఆందోళనలను భగ్నం చేసేందుకు వికలాంగుల సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం తగదని వికలాంగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కమతం వెంకటేష్ విమర్శించారు. శనివారం చలో విజయవాడ వికలాంగుల మహాగర్జన కార్యక్రమంలో భాగంగా ఆదోనిలో ముందస్తు అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఆందోళనలను అణచివేత ధోరణి ప్రజాస్వామ్య మనుగడకే ముప్పు అని తెలిపారు. ఇంటికే పరిమితం చేయడం త్రీ టౌన్ పోలీసులకు తగదని ఆయన మండిపడ్డారు.

నాయకునికి నోటీసు ఇస్తున్న పోలీసులు

నీరు లేక...

ఎడారిగా మారిన తుంగభద్ర...

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన రాఘవేంద్రస్వామి కొలువైన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తూ జీవనదుల్లో ఒకటైన తుంగభద్ర నది నీరు లేక ఎడారిగా మారింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా తుంగభద్ర నదిలో నీరు లేక వెలవెలబోతోంది. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ సమీపంలో తుంగభద్ర నదుల సంగమంలో ప్రవహిస్తూ నదీ పరివాహక ప్రాంతాల వారికి తాగునీటితో పాటు పంటలకు నీరందించే తుంగభద్ర గతేడాది నుంచి నీటి పారుదల లేక కళ విహీనమై దర్శనమిస్తోంది. మండుతున్న ఎండలతో పుష్కర ఘాట్లలో నీటి బిందువులు కూడా కనిపించక ఇసుక రేణువులతో, బండలతో కనిపిస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ వద్ద డ్యాం నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో తాగునీటి కోసం కాలువలకు నీరు విడుదల చేశారు. గతేడాది వర్షాలు పుష్కలంగా కురిసినా నిలువ చేయలేని ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 5 వేల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలిసింది. ముందుచూపు లేకపోవడంతో మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ ప్రాజెక్టు, బసలదొడ్డి రిజర్వాయర్, చిన్నతుంబళం చెరువుతో పాటు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేసుకుని నిల్వ చేసుకోలేని దుస్థితి నెలకొంది. తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలకు కనీసం తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం చేరుకున్న భక్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇక పశు పక్షాదుల పరిస్థితి దుర్భరంగా మారింది. నెలకు రూ.కోట్ల ఆదాయం ఉన్న శ్రీరాఘవేంద్రస్వామి మఠం యాజమాన్యం తాగునీటి సమస్యపై దృష్టి సారించకపోవడం వల్ల భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ముందస్తు చర్యలు చేపట్టి తుంగభద్ర నదిలో మూడు పెద్ద సెలిమిలను జెసిబి ద్వారా తవ్వించడంతో పాటు అవసరం ఉన్న చోట బోర్లు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. శ్రీమఠం యాజమాన్యం కూడా తుంగభద్ర నదీతీరంలో బోర్లు వేయించి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నీరు లేక వెలవెలబోతున్న తుంగభద్ర నది

పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేయాలి

- టిడిపి ఎస్సీ సెల్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కులం పేరుతో దూషించి దళిత మహిళలపై దాడికి పాల్పడిన వైసిపి నాయకుడు పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేయాలని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మర జేమ్స్, ఈరన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శులు జయరామ్, జెకె.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.నరసప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగనాథనహళ్లికి చెందిన హరిజన జయమ్మ, భర్త హరిజన శివయ్యను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2019 ఎన్నికల్లో సాయి ప్రసాద్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి గెలుపునకు సహకరించిన మాల, మాదిగలపై వైసిపి నాయకులు దాడులు చేయడం విచారకరమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆదోనిలో మీనాక్షి నాయుడును గెలిపించి, మరోసారి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని, మాల, మాదిగలు జీవితాలకు రక్షణ కల్పించుకోవాలని కోరారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు ఎం.లక్ష్మీనారాయణ, జయరామ్, రాము, సురేంద్ర, వీరేష్, పరశురాం, బాలస్వామి, జయరాజు, ఈరన్న, రంగస్వామి, శంకర్, శివ, నరసయ్య, బాలరాజు, చిట్టిబాబు, రామలింగ, వీరన్న, రవి, గోవింద, ఉలిగప్ప, గణేష్, బాలాజీ, రంగన్న, మురళీ, జగదీష్, శంకర్ పాల్గొన్నారు.

కేసు వివరాలు తెలుసుకుంటున్న టిడిపి ఎస్సీ సెల్ నాయకులు

ఘనంగా భ్రమరాంబ, మల్లికార్జున స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులో వెలసిన భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల రథోత్సవం మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో శనివారం ఘనంగా జరిగింది. ఆలయ పెద్దలు నరవ రమాకాంతరెడ్డి, నరవ విరూపాక్షిరెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, రంగారెడ్డి, మురళీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబికాదేవి, మల్లికార్జునస్వాముల రథోత్సవం అశేష భక్తవాహిణి మధ్య రమణీయంగా సాగింది. అంతకుముందు స్వాములవారికి జలాభిషేకం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీమల్లికార్జున స్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా వచ్చి ప్రతిష్టించారు. ఆలయ పెద్ద నరవ రమాకాంతరెడ్డి ఇంటి నుంచి పూర్ణకుంభంతో వచ్చి పూజలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, మాజీ ఎంపిపి రఘురామ్, విశ్రాంత విఆర్ఒలు రామలింగారెడ్డి, కృష్ణమూర్తి, టిడిపి నాయకులు ఏసేపు, మల్లికార్జున, మీ సేవ ఆంజనేయులు, రెయిన్‌బో హైస్కూల్ కరస్పాండెంట్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

కమనీయం.. పార్వతి, పరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామ సమీపంలో ఉన్న శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ నాయన ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. వీరభద్ర స్వామి వేషధారణ, గొరవయ్యల పాల సేవ, నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయంలో స్వామివారికి గంగ పూజ, కుంభోత్సవం నిర్వహించి, నంది కోల సేవ, గంధం సేవ పుర వీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు.

ఆస్పరి : కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శివరాత్రి వేడుకలు

ఆస్పరిలో శివరాత్రి సందర్భంగా శ్రీపక్కీరప్ప తాత దేవాలయంలో పూజారి పెద్ద పక్కీరప్ప తాత ఇంటి నుంచి కుంభోత్సవం పురవీధుల గుండా ఊరేగించారు. పక్కీరప్ప తాత దేవాలయం చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై ఉంచి రథోత్సవం ముందుకు సాగింది. తిరిగి యథాస్థానానికి చేరుకుంది. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **దేవనకొండ** మండలంలోని దేవనకొండ, కోటకొండ గ్రామంలో కొలువైన శంకర దేవాలయ, రాంబావి రామలింగేశ్వర స్వామి దేవాలయం పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సం వైభవంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా దేవాలయాల్లో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పార్వతి, పరమేశ్వరుల ప్రతిమలను, విగ్రహాలను గ్రామ వీధుల గుండా ఊరేగించారు. లక్ష్మి కొలుట్ల చెన్న కేశవ స్వామి ఆలయ ఛైర్మన్ ఆర్.హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

దేవనకొండ : ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఇదేనా అభివృద్ధి జగన్‌రెడ్డి..?

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'ఇదేనా మీ అభివృద్ధి జగన్మోహన్ రెడ్డి' అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ప్రశ్నించారు. శనివారం 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 16వ వార్డులో పర్యటిస్తూ అక్కడ సుమారు ఐదేళ్ల నుంచి దోబీ ఘాట్ దగ్గర నిర్మిస్తున్న బ్రిడ్జి (వంతెన) గురించి వైసిపి ప్రభుత్వానికి సెల్ఫ్ ఛాలెంజ్ చేస్తున్నట్లు బీవీ తెలిపారు. ఈ ప్రాంతంలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ పథకాల ద్వారా ఒక కుటుంబం ఎంత లబ్ధి చేకూరుతుందో తెలిపారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడడం ద్వారానే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని కోరారు. కౌన్సిలర్ రామదాస్ గౌడ్, కలీముల్లా, రంగస్వామి గౌడ్, తురేగల్ నజీర్ అహ్మద్, మహబూబ్ బాషా, కొండయ్య చౌదరి, సుందర్ రాజు, రామకృష్ణ, కటారి రాజేంద్ర పాల్గొన్నారు.

రాయలసీమ నిరుద్యోగ గర్జన కరపత్రాలు విడుదల

ఎమ్మిగనూరు రూరల్ : ఈ నెల 12న కర్నూలులో జరగనున్న రాయలసీమ నిరుద్యోగ గర్జన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనగేశ్వర రెడ్డి, ఆర్‌పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది విడుదల చేశారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. నిరుద్యోగలకు ప్రతేడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీఇచ్చారని తెలిపారు. ఇప్పటికీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ఆర్‌పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది మాట్లాడుతూ... 'జాబ్ కావాలంటే, బాబు రావాలి' అనే నినాదంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించి టిడిపికి మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకొస్తారని తెలిపారు. ఆర్‌యుఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ పాల్గొన్నారు.

సమస్యలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలి

- ప్రజా వైద్యులు డాక్టర్ రీటా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'మాటల్లో మాత్రమే కాదు.. చేతల్లోనూ సమానత్వం కావాలి. ఎలాంటి నిబంధనలూ లేకుండా స్త్రీలకు సమాన హక్కులు కల్పించినప్పుడే మహిళలు సాధికారత వైపు పయనిస్తారు' అని డాక్టర్ రీటా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ నాయకులు జి.శ్రీదేవి అధ్యక్షతన మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు ఈ వారంలోనే కోస్ట్ గార్డు మహిళా అధికారులు, ఉద్యోగుల సమస్యపై కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని తెలిపారు. స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ మహిళా కార్మికులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని చెప్పారు. సమాన ఆస్తి హక్కు చట్టం అమలు కావడం లేదన్నారు. లక్షలాది మంది మహిళలు కనీస వేతనాలు, ఉపాధి, ఉద్యోగ భద్రత, హింస లేని సమాజం కోసం పోరాడుతున్నారని తెలిపారు. న్యాయవాది విమల మాట్లాడుతూ... ఆర్థిక అసమానతలే కాకుండా, సామాజిక అసమానతలు కూడా స్త్రీలను రెండో స్థాయికి నెట్టివేశాయని తెలిపారు. కుటుంబ నిర్వహణ, భద్రత లేకపోవడం స్త్రీల ఉపాధికి ఆటంకంగా ఉన్నాయని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నాగమణి, జిల్లా సహాధ్యక్షులు బి.జీవిత మాట్లాడుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక ఈవెంట్ కాదని, ఒక పోరాట చిహ్నమని తెలిపారు. స్త్రీల ఐక్యత, పోరాడే మార్గంపై స్పష్టత, సృజనాత్మకంగా నూతన ఒరవడిలో రైతులను, కూలీలను, మహిళా కార్మికులను, గృహిణులను కలుపుకొని పోరాటాలకు అడుగులు వేయాలని ప్రతిజ్ఞ చేసుకుందామని తెలిపారు. ఎంకె.విజయలక్ష్మి, బి.ఉమా, ఎస్.సుమలత, నాగస్వర్ణలత, అరవిందమ్మ, నిర్మలమ్మ, విక్టోరియా, అనురాధ, ద్రాక్షమ్మ, సువర్ణమ్మ, వినీలా, సుశీలమ్మ, కె.జయమ్మ, సరళ, షాహిన్ భాను, గిరిజాదేవి, విమలత, మంజుల, సుల్తానా సుమియమ్, చిట్టెమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజా వైద్యులు డాక్టర్ రీటా

ఆదోనిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - ఆదోని

రాబోయే ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివ నారాయణ స్వామి పర్యవేక్షణలో సిఐలు తేజ, గోపి, నరసింహ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్, ఎస్ఎస్‌బి పోలీసులు ఆదోనిలోని స్టేట్ బ్యాంకు, భీమా సర్కిల్, మీర్ మహ్మద్ షావలీ దర్గా, జైన్ టెంపుల్ సర్కిల్, శ్రీనివాస భవన్, బాబు ప్లాజా సర్కిల్, ఆర్‌ఆర్ జంక్షన్ సర్కిల్, పెద్ద మసీదు, వన్ టౌన్ పోలీసు స్టేషన్, హాజీపూర్ ఓల్డ్ పోస్ట్ ఆఫీస్, బొబ్బులమ్మ గుడి, చౌదరి బాయి, గణేష్ సర్కిల్, బుడేకల్, గుల్ హుస్సేన్ షా వలీ దర్గా సర్కిల్, హవన్నపేట జంక్షన్, కౌడల్ పేట్, తిక్క స్వామి దర్గా, పోలీసు కంట్రోల్ రూమ్, చందాసా దర్గా మీదుగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశమని డీఎస్పీ తెలిపారు.

11న సమావేశం

- వాలంటీర్లు, వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలి

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 11న ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్ హాలులో జరిగే సమావేశానికి చిప్పగిరి మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు హాజరుకావాలని వైసిపి మండల కన్వీనర్ జుటూరు మారయ్య కోరారు. శనివారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి, ఐ ప్యాక్ టీం వారు పాల్గొంటున్నారని తెలిపారు. వైసిపికి చెందిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

జగన్ ప్రభుత్వానికి ఇక సమాధే

- టిడిపితోనే బీసీలకు పెద్ద పీట - డాక్టర్ మాచాని సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బీసీలను అనేక రకాలుగా వేధించి, దాడులు చేసి, హత్యలు చేయించిన జగన్ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో సమాధి చేసే సత్తా బీసీలకు ఉందని టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ తెలిపారు. టిడిపితోనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నడానికి 'జయహో బీసీ' సభలో టిడిపి అధినేత ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తోనే మరోసారి స్పష్టమైందని చెప్పారు. శనివారం పట్టణంలోని మిలిటరీ కాలనీలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని మిలటరీ కాలనీలోని శ్రీనెట్టికంట సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 34 శాతంలో 10 శాతం కోత పెట్టి 24 శాతానికి పరిమితం చేయడంతో 16,800 బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు. జయహో బీసీ సభలో చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చూస్తుంటే బీసీల ఆత్మగౌరవానికి నాంది పలికిందన్నారు. బీసీలకు 50 ఏళ్ల వయసుకే రూ.4 వేల పింఛను మంజూరు చేయడమే కాకుండా, బీసీలపై సామాజిక దాడులు జరగకుండా నిలువరించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం రూపొందించడం అభినందనీయ మని తెలిపారు. బీసీలు ఐకమత్యంతో ఉండి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, టిడిపి కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ కురువ సాధికారిక కమిటీ సభ్యులు అడ్వకేట్ కెటి.మల్లికార్జున, ఆత్మ మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇప్పె నరసప్ప, కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, రోజా ఆర్ట్స్ ఉసేని, తెలుగు మహిళా నాయకులు గోకారమ్మ, చేనేత విభాగం నాయకులు లక్ష్మి రెడ్డి, కామర్తి గంగాధర్, సుడిగుండు శ్రీనివాసులు, ధన, రంగస్వామి, శేఖర్, వెంకటేష్, టిడిపి మైనార్టీ నాయకులు గోరా బాష, జోహార్ అబ్బాస్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మాచాని సోమనాథ్

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - ఆస్పరి

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బిణిగేరి గ్రామంలో ఆలయ నిర్వాహకులు శ్రీనివాస నాయన ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శనివారం పార్వతి, పరమేశ్వరుల కల్యాణంలో వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన అలసంద గుత్తి జట్టుకు చంద్రశేఖర్ చేతులమీదుగా రూ.15,016, రెండో బహుమతి బిణిగేరి మెగా కింగ్స్ జట్టుకు వైసిపి నాయకులు సోమన్న చేతులమీదుగా రూ.7,016 అందజేశారు. సర్పంచి వెంకటేష్, గ్రామ పెద్దలు చిన్న రెడ్డి, భీమన్న, వెంకటేష్, తిక్కయ్య పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్

చిరుత మృతికి అటవీ శాఖ, పోలీసులదే బాధ్యత

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్

ఎమ్మిగనూరు రూరల్ : ఆదోని రోడ్డులోని ఎస్ఎమ్ఎల్ డిగ్రీ కళాశాల వద్ద చిరుతపులి అనుమానాస్పదంగా మృతి చెందిందని, దీనికి పోలీసులు, అటవీ శాఖాధికారులే బాధ్యత వహించాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. కొన్నాళ్ల క్రితం సుశీలమ్మ కొండల్లో ఒక చిరుతపులి దొరికిందని, దీనిపై అటవీ శాఖాధికారులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఆ కొండల్లో మరో పులి ఉందని దానికి పిల్లలు కూడా ఉన్నాయని కేసులకు భయపడి రైతులు, గొర్రెల కాపరులు అధికారులకు సమాచారం ఇవ్వడానికి భయపడ్డారని చెప్పారు. అటవీశాఖాధికారులు, పోలీసులు స్పందించి కొండల్లో ఉన్న పులులను వెతికి రక్షించి ఉంటే చిరుతపులి మరణం జరిగేది కాదని చెప్పారు. మిగిలిన చిరుత పులులను వెతికి రక్షించాలని, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

బీసీ డిక్లరేషన్‌పై నాయకుల హర్షం

- ఎన్‌టిఆర్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - గోనెగండ్ల

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ఇటీవల మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌పై శనివారం గోనెగండ్లలోని టిడిపి కార్యాలయం వద్ద నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తూ టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టిడిపి నాయకులు తిరుపతయ్య నాయుడు, నజీర్ సాహెబ్, బేతాళ బడేసాహెబ్, వెంకటకృష్ణమ నాయుడు, కులుమాల రాముడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, మదీనా, పిల్లిగుండ్ల జైపాల్, లింగందిన్నె నాయుడు, ఐరన్‌బండ ముల్లా బాష, కొత్తింటి ఫక్రుద్దీన్, గౌవుండా రహమతుల్లా, పెద్దమరివీడు నాగరాజు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు... మండలంలోని చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ సునీల్, గోనెగండ్ల గ్రామానికి చెందిన బోయ రంగస్వామిలు కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ (90 ఎంఎల్ టెట్రా మద్యం ప్యాకెట్లను) అక్రమంగా తరలిస్తుండగా గజ్జిహళ్లి రోడ్డులోని మద్దికెర కుంట వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి 35 బాక్సుల మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఉన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: KURNOOL

DISPUTE NO. 79/2022

Between:

M/s. Capital Chit India Pvt Ltd Kurnool .... DISPUTANT

V/s

Arepogu Emmanuel and Others .... OPPONENTS

NOTICE TO OPPONENTS 1 TO 5

(1) Arepogu Emmanuel (Late) s/o A. Savaranna, Christian, resident of H.no: 40-187, Bangaru peta, Kurnool city and district.
(2) Salakapuram Bhaskar s/o S. Narasimhulu, aged about 46 years, Christian, working as Public health Worker. O/o 6th Division in Public Health Section, Kurnool Municipal Corporation, Kurnool city and district. resident of H.No:- 47/29B, Madiga street, Budhavara peta, Kurnool city and district.
(3) Saginala Ramesh Babu s/o S. Subbanna, aged about 49 years, Hindu, working as Office Subordinate, O/o Special Deputy collector, (L.A) H.N.S.S Unit III, C/D 9, B-camp. Kurnool city and District. resident of H.no: 40/218-A-1, Bangaru peta, Near MRP Trade center, Kurnool city and district.
(4) Kotla Surendra Reddy s/o K. Prabhakar Reddy, aged about 37 years, Hindu, resident of. H.no: 51-962-A8, Illur nagar, Kurnool city and district
(5) Arepogu Michael s/o A. Emmanuel, aged about 29 years, Christian, resident of H.no: 40-187, Bangaru peta, Kurnool city and district

పై దావ నందు DISPUTANT కంపెనీ వారు వారికి రావాల్సిన బాకీ మొతం రూ.3,39,200/- అసలు మరియూ ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీ పైనా దావా దాఖలు చేసినారు. ఇందులో 1 నుండి 5 వరకు OPPONENTS అయిన మీరు తేది. 16-03-2024వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరుకాని మీ తరుపున వకీలు గాని హాజరై మీకు ఏమైన అభ్యంతరములు వున్నచో తెలుపుకోగలరు. లేనిచో మీకు ఏలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తిర్మనించబడునని ఇందుములముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ : 16-03-2024

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR: KURNOOL.

బిజెపితో పొత్తుపై ఆందోళన

- మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమవుతాయని చర్చ
- లాభనష్టాలపై టిడిపి నేతల్లో తర్జన భర్జన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు ఖరారైంది. దీనిపై టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమవుతాయని చర్చ సాగుతోంది. బిజెపితో పొత్తు ఎంత మేరకు లాభం చేకూరుస్తుంది? ఎంత మేరకు నష్టం చేకూరుస్తుంది? అన్న వాటిపై నేతల్లో తర్జన భర్జన నెలకొంది.

మొన్నటి వరకూ టిడిపి, జనసేన కూటమి ఇప్పుడు బిజెపితో జత కట్టింది. టిడిపి, జనసేన, బిజెపి కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. వాటికి సంబంధించి సీట్ల సర్దుబాటు కొనసాగుతోంది. ఇప్పటికే టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఆళ్లగడ్డ టికెట్‌ను భూమా అఖిలప్రియకు, శ్రీశైలం టికెట్‌ను బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, కర్నూలు టికెట్‌ను టిజి.భరత్‌కు, పాణ్యం టికెట్‌ను గౌరు చరితారెడ్డికి, నంద్యాల టికెట్‌ను ఎన్ఎండి ఫరూక్‌కు కేటాయించారు. బనగానపల్లె టికెట్‌ను బిసి.జనార్ధన్‌రెడ్డికి, డోన్ టికెట్‌ను కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి, పత్తికొండ టికెట్‌ను కెఇ.శ్యాంబాబుకు, కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించారు. ఆళ్లగడ్డ, శ్రీశైలం, కర్నూలు, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ టికెట్లను ఆయా నియోజకవర్గాల టిడిపి సమన్వయకర్తలకే కేటాయించారు. ఇంకా నందికొట్కూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు స్థానాలకు టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. పొత్తులో భాగంగా ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేనకు, బిజెపికి సీట్లు కేటాయించే పరిస్థితి లేదు. ఇప్పటికే సీట్లు ఖరారైన అభ్యర్థులు జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో భాగంగానే ఎన్నికల ప్రచారాం కూడా నిర్వహిస్తున్నారు. తాజాగా టిడిపి, జనసేన కూటమి బిజెపితో పొత్తు ఖరారు చేసుకోవడంతో టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. మైనార్టీలు, దళితుల ఓట్లు దూరమయ్యే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, కర్నూలు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీల ఓట్లు అధికంగా ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో దళితులు, క్రైస్తవుల ఓట్లు, కోడుమూరు నియోజకవర్గంలో దళితుల ఓట్లు అధికంగా ఉన్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాకా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలపై, క్రిస్టియన్లపై, దళితులపై దాడులు జరిగాయి. పలు సందర్భాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముస్లిములపై, మణిపూర్‌లో క్రిస్టియన్లపై జరిగిన దారుణ మారణకాండలను ముస్లిం, క్రైస్తవ సంఘాలు ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. బిజెపికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయి. దీనికి తోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకపోవడంతో పాటు వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించలేదు. నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచేసింది. దీంతో బిజెపికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు పలు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాల ద్వారా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో కొన్ని వర్గాల ప్రజల్లో బిజెపి పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బిజెపితో టిడిపి, జనసేన పొత్తు వల్ల ఆ వ్యతిరేకత కూటమిపై పడే అవకాశం ఉందని, ఆయా వర్గాల ఓటర్లు దూరమయ్యే పరిస్థితి ఉందని చర్చ మొదలైంది. గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేనకు 1.7 శాతం ఓట్లు పడ్డాయి. బిజెపికి 1 శాతం ఓట్లు కూడా రాలేదు. అంత తక్కువ శాతంలో ఓట్లు ఉన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవడం తమకు ఏ మాత్రం లాభం? ఎంత వరకు నష్టం ? అని టిడిపిలోని మైనార్టీ నాయకుల్లో, దళిత నాయకుల్లో తర్జన భర్జన నెలకొంది.



అంగరంగ వైభవంగా

శ్రీశైల మల్లన్న రథోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నాడు అంగరంగ వైభవంగా మల్లన్నకు రథోత్సవం జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రంలో జరిగే 11 రోజుల ఈ బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజున స్వామి అమ్మ వార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం జరిగిన రథోత్సవ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ముందుగా రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించి రథాంగపూజ , రథాంగ హెూమం, రథంగా బలి కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను రథాంగంపై ఏర్పాటు చేసి పూజ నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల మధ్య రథసాల వద్ద నుండి నంది గుడి వరకు అంగరంగ వైభవంగా వేలాదిమంది భక్తుల మధ్య రథోత్సవ కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించడం జరిగింది. ఈ రథోత్సవ కార్యక్రమంలో కోలాటం చెక్కభజన వంటి వివిధ రకాల కళాకృతులు పాల్గొన్నారు.

రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం

క్షేత్రంలో జరిగే 11 రోజుల బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజున స్వామి అమ్మ వార్లకు తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయానికి ఈశాన్య భాగంలో ఉన్న పుష్కరిని వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగింది. అదేవిధంగా తెప్పోత్సవం కార్యక్రమానికి ఏర్పాటుచేసిన తేప్పను కూడా వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగింది. అనంతరం ఆలయంలో నుండి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిపై భజంత్రీల మధ్య తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్ప పై వెంచెబు చేశారు.ఆ తరువాత తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : క్షేత్రానికి వచ్చే భక్తులను అలరించేందుకు దేవస్థానం పలు రకాల సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలు నిత్య కళారాధన వేదికపై సంప్రదాయ నృత్యం భజన కార్యక్రమాలను, పుష్కరిణి వద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన, శివ దీక్ష శిబిరాలలో రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం నాటకాల ను ప్రదర్శించారు.

నేడు అహోబిలంకు మంత్రి రోజా రాక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలానికి ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా రానున్నారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్ర పండుగగా ఇటీవల గుర్తించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామికి, అమతవల్లి అమ్మవారికి ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మంత్రి రోజా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు గంగుల నాని, రాష్ట్ర జల వనరుల శాఖ గౌరవ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలు పాల్గొననున్నారు. భక్తుల సమక్షంలో వాటిని అందజేయ నున్నారని అహోబిలం దేవస్థానం కమ్యూనికేషన్ అధికారి కిడాంబి సేతురామన్ తెలిపారు.

యధేచ్ఛగా.. ఎర్రమట్టి అక్రమ రవాణా

- తరలిపోతున్న సహజ సంపద
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎర్రమట్టిని తవ్వడంతో ఏర్పడిన గుంతలు, దారులు

ప్రజాశక్తి- మహానంది

మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో అంకిరెడ్డి చెరువు నుంచి రాత్రి వేళలో అక్రమంగా టిప్పర్ల ద్వారా మట్టి ఇటుకల బట్టీలకు రవాణా చేస్తూ లక్షలు సంపాదించుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి ఇష్టానుసారం రవాణా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి రవాణా మితిమీరిన వేగం, వాహాదారులను, స్థానికులను భయపెడుతున్నాయి. మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మండల అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు అధికారుల తీరు పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి రవాణా రాత్రిపూట జోరుగా సాగుతుందని గ్రామస్తుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు వేగంగా నడుపుతుండడం, రోడ్డుపై మట్టి పెళ్లలు పడుతుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని చర్చించుకుంటున్నారు. వాల్టా చట్టం ప్రకారం పొలాల్లో మట్టి తవ్వకాలకు సంబంధిత రెవెన్యూ, గనుల శాఖల అనుమతి పొందాల్సి ఉంది. ఇక్కడ ఎలాంటి అనుమతులు తీసుకోరు. అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి ఇష్టానుసారం అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. టిప్పర్ల ద్వారా మట్టి రవాణా మితిమీరిన వేగం, వాహనదారులను, స్థానికులను భయపెడుతున్నాయి. మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లారీల్లో ఎర్రమట్టిని తరలిస్తున్న దృశ్యం

ఎర్రమట్టిని తవ్విన దృశ్యం

తహశీల్దారు వివరణ: మహానంది తహశీల్దార్ రామచంద్రుడును ప్రజాశక్తి వివరణ కోరగా మహానంది మండలంలో మట్టి తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. అక్రమ మట్టి గురించి ఏదైనా సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలి

- సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు
- 11న ఎస్‌బిఐ బ్యాంకు ముందు ఆందోళన

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని ఈ నెల 11వ తేదీన నందికొట్కూరు పట్టణంలోని ఎస్.బి.ఐ బ్యాంకు ముందు జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. శనివారం నందికొట్కూరు సిపిఎం కార్యాలయంలో సిపిఎం నాయకులు కె భాస్కర్ రెడ్డి, పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, సి నాగన్నతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని గత నాలుగు సంవత్సరాలు నుండి ఎన్నికల బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలు మార్చి 6వ తేదీ లోపల ఎన్నికల కమిషనర్‌కు వివరాలు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన ఇంతవరకు వివరాలు అందజేయలేదని ఈనెల 13వ తేదీకి ఎన్నికల కమిషనర్ ఏ రాజకీయ పార్టీకి ఎన్ని నిధులు వచ్చాయో ప్రకటించాలని ఆదేశించినప్పటికీ ఎస్‌బిఐ బ్యాంకు ఇంతవరకు సమర్పించకపోగా 116 రోజులు గడువు కోరడం జూన్ 30 కల్లా సమాచారం అంతా అందజేస్తామని చెప్పడం విచార కరమన్నారు. జూన్ నాటికి ఎన్నికలు పూర్తవుతాయి అనే ఉద్దేశంతో బిజెపితో పాటు పొలిటికల్ పార్టీలకు తల వంచిన ఎస్‌బిఐ వారు ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించకుండా కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా నందికొట్కూరు ఎస్‌బిఐ బ్యాంక్ ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతు ందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఈ స్కీము తెచ్చిపెట్టిందని వీటి ద్వారా కార్పొరేట్ శక్తులకు అనేక రకాలుగా ప్రజాధనాన్ని దోచిపెట్టి వారి నుండి పార్టీ విరాళాలు సేకరించుకొని సేకరించిన నిధులను రహస్యంగా ఇచ్చిన దాతలు వివరాలు వెల్లడించకుండా రాజ్యాంగ విరుద్ధంగా తీసుకువచ్చిన ఈ స్కీంను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు.

మాట్లాడుతున్న ఎం నాగేశ్వర రావు

ఎన్నికల హడావుడి ఆరంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వైసిపి ఐదు నియోజకవర్గాల్లో, టిడిపి, జనసేన కూటమి తొమ్మిది నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేశాయి. వైసిపి నుంచి కర్నూలుకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను, ఎమ్మిగనూరుకు బుట్టా రేణుకను, కోడుమూరుకు డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను, ఆలూరుకు బుసినే విరూపాక్షిని, నందికొట్కూరుకు డాక్టర్ దారా సుధీర్‌ను ఆ పార్టీ అధిష్టానం నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించింది. ఆ పార్టీ వారినే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా నిర్ణయించింది. మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఆ తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా టిడిపి, వైసిపికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. టిడిపి అభ్యర్థులు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందులో భాగంగానే ఎన్నికల ప్రచారం కూడా చేస్తున్నారు. టిడిపి అభ్యర్థుల్లో ఆళ్లగడ్డలో భూమా అఖిలప్రియ, బనగానపల్లెలో బిసి.జనార్ధన్ రెడ్డి, కర్నూలులో టిజి.భరత్, పత్తికొండలో కెఇ.శ్యాంబాబు, శ్రీశైలంలో బుడ్డారాజశేఖర్ రెడ్డి, పాణ్యంలో గౌరు చరిత రెడ్డి, నంద్యాలలో ఎన్ఎండి.ఫరూక్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో సభలను కూడా నిర్వహించారు. వైసిపి అభ్యర్థుల్లో ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎఎండి.ఇంతియాజ్ అహ్మద్ కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు పట్టాలు పంపిణీ చేసే ప్రభుత్వ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. కోడుమూరులో డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఆలూరులో బుసినే విరూపాక్షి, నందికొట్కూరులో దారా సుధీర్, ఎమ్మిగనూరులో బుట్టా రేణుక, జోరుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైసిపి అభ్యర్థులుగానే ఏకంగా ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. అభ్యర్థులా ఇన్‌ఛార్జులా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను ప్రారంభించారు.

అవీ..ఇవీ..అన్నీ.. జిల్లా వ్యాప్తంగా పోలియో ఆదివారం నిర్వహించారు. పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో ఆదివారం విజయవంతానికి ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఇన్‌పుట్ సబ్సిడీ నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, కాల్వబుగ్గ, ఓకారంతో పాటు అన్ని ప్రాంతాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

- డోన్ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని కొండపేటలోని 14, 15 వార్డులలో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డితో పాటు ఆయన కూతురు కోట్ల నివేదితమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఆలోచించి రాష్ట్రం, డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే తెలుగుదేశం ప్రభుత్వానికి ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసిపి ప్రభుత్వం లో యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందన్నారు. టిడిపి సూపర్‌సిక్స్ మేనిఫెస్టోపై ప్రజలకు వార్డులలో కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టిఇ.కేశన్నగౌడ్, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రిరమణ, చాటకొండ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులో టిడిపిమేనిఫెస్టోపై
ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

వైభవంగా మహానందీశ్వరుని కళ్యాణం

మహానందిలో స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లిలో సంగమేశ్వరుడి కళ్యాణం

ప్రజాశక్తి - మహానంది

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానంది మహా పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ మహానందీశ్వర స్వామి వారికి శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి లోక కళ్యాణార్థమై శనివారం లింగోద్భావ అనంతరం స్వామి అమ్మవార్లకు స్థానిక కళావేదికపై వేద పండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో ఘనంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. శుక్రవారం రాత్రి 10 గంటల నుండి లింగోద్భవ కాల సమయమున స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం శనివారం వేకువజామున నిర్వహించిన ఈ కళ్యాణ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి క్షేత్రానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి పాల్గొని అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు పోలీసు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. **పాణ్యం :** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో నాగ లింగేశ్వర స్వామి కళ్యాణం కమనీయంగా జరిగింది. లింగోద్భవ సమయం తరువాత భక్తుల సమక్షంలో అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, ఈఓ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని కళ్యాణం జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కమనీయంగా... సంగమేశ్వరుడి కళ్యాణం

కొత్తపల్లి: సప్తనది సంగమ తీరంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయ ప్రాంగణంలో శ్రీలలితా సంగమేశ్వరుడి కళ్యాణం అంగరంగ వైభవంగా ఆలయ ఇన్చార్జ్ ఈఓ మోహన్ పర్యవేక్షణలో జరిగింది. సంగమేశ్వరుడి కళ్యాణాన్ని తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు సంగమేశ్వరాల యాన్ని చేరుకొన్నారు. అక్కడే ఉన్న సప్తనదుల సంగమ ప్రాంతంలోని కృష్ణానది జలాలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోశ్చరణల మధ్య, శాస్త్రోక్తంగా, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించడంతో కళ్యాణ తంతు కన్నుల పండుగగా నిర్వహిం చారు. కాళ్యాణ తంతులో భాగమైన అభిజిత్ ముహూర్తం, అబిజిత్ లగ్న కాలంలో జీలకర్ర బెల్లం కార్యక్రమంతో కళ్యాణ ఘట్టం జరిగింది. కన్యాదానం, తలంబ్రాలు కార్యక్రమాలతో లలితా సంగమేశ్వరుడి కళ్యాణం ఘనంగా జరిగింది. భక్తులు కళ్యాణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. సంగమేశ్వరుడి కళ్యాణం రెండు రాష్ట్రాల భక్తుల మధ్యలో కన్నుల పండుగగా జరిగింది. కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తాదులకు పాత సంగమేశ్వరం గ్రామస్తులు కాశిరెడ్డి నాయన ఆధ్వర్యంలో ఉచిత భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సంగమేశ్వరుడి హుండీ లెక్కింపు.. సప్తనదుల సంఘమ క్షేత్రంలో వెలసిన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా క్షేత్రంలో ఏర్పాటుచేసిన హుండీలో భక్తులు వేసిన కానుకల ను హుండీ లెక్కింపు ఈఓ మోహన్, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, గ్రామస్థులు ఆధ్వర్యంలో జరిగింది. సంగమేశ్వరాలయానికి పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు హుండీలో వేసిన విరాళాలను లెక్కించగా రూ.72,534 నగదు రావడం జరిగింది. వీటిని దేవాలయ అవసరాల నిమిత్తం ఖర్చు చేస్తామని ఆలయ ఈఓ అన్నారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది భక్తబృందం పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దుర్గా భోగేశ్వరుడి ఆలయం

గడివేముల : మండలంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఐసాని సునీల్ కుమార్ రెడ్డి దంపతులు అమ్మవారి తరపున సురా వెంకట్ రెడ్డి దంపతులు పెళ్లి పెద్దలుగా ఉండి స్వామివారి కల్యాణ మహెూత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు నైవేద్యం నిర్వహించారు. ఆలయానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, సిఐ వెంకటేశ్వరరావు దంపతులు, శాంతిరాం విద్యా సంస్థల అధినేత మిద్దె శివరాం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ ఐసాని సునీల్ కుమార్ రెడ్డి లు పూలమాలలతో శాలువాలతో సత్కరించి ఆలయ జ్ఞాపికను అందజేశారు. మిగతా 6వ పేజీలో...

నీటిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ప్రమాదవశత్తు నీళ్లలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. గూడూరు మారుతీ (44), తండ్రి లేట్ నారాయణ శివన్న నగర్ తాడిపత్రి పట్టణం అనంతపురం జిల్లా అను వ్యక్తి ఈనెల 8న గొర్విమానుపల్లె గ్రామం దగ్గరలో గల లోక్కిగుండం లోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశత్తు నీళ్లలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య గూడూరు మహేశ్వరీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన మారుతి

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రామ్మోహన్‌కు చెందిన గడ్డివాములు శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రామ్మోహన్‌కు చెందిన రూ.రెండు లక్షల విలువైన పశుగ్రాసం నిప్పంటుకొని క్షణాల్లోనే మంటలు వ్యాప్తించి రెండు వాములు దగ్ధమయ్యాయి. వాటితో పాటు ఉన్న మరో రైతు ఓబుల్రెడ్డికి చెందిన రూ లక్ష విలువ చేసే గడ్డివామి కూడా దగ్ధమైంది. బాధిత రైతు మాట్లాడుతూ తన గడ్డివాములను ఎవరో కావాలనే నిప్పంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. బాధితులకు రూ మూడు లక్షల మేర ఆస్తినష్టం సంభవించిన్నట్లు పేర్కొన్నారు.

దగ్ధమౌతున్న గడ్డివాములు

మాట్లాడుతున్న భారతి విద్యాసంస్థల చైర్మన్ వై నాగేశ్వరరావు

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

- భారతి విద్యాసంస్థల చైర్మన్ వై నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని భారతి విద్యాసంస్థల చైర్మన్ వై నాగేశ్వరరావు అన్నారు. నంద్యాల జిల్లా జ్ఞానపురం నందు నూతనంగా ప్రారంభించిన న్యూ లుక్ షో రూమ్, టైలరింగ్ అండ్ డిజైనింగ్ వర్క్స్ షోరూంను భారతి గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల అధినేత నాగేశ్వరావు, భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ అనిత, డాక్టర్ ఆశ లత గారి చేతులమీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానం అని మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాలని అన్నారు. షోరూం ఓనర్ మాట్లాడుతూ మహిళలకు ఎంత గానో వాళ్ళకి ధైర్యం ఇచ్చి వాళ్ళు వారి సొంత కాళ్ళ మీద నిలబడేలా చేయాలనీ, ఉన్నత స్థాయికి రావాలని కోరుకుంటున్నానని అన్నారు

అంధ విద్యార్థులకు నిత్యావసర కిట్లు పంపిణీ

నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక క్రాంతి నగర్‌లో ఉన్న జీవన జ్యోతి అంధుల పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యుడు శేగు నందకిషోర్ జన్మదినం సందర్భంగా నిత్యావసర కిట్లు, పరీక్షల రాత కిట్లు నందకిషోర్ సౌజన్యంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.వీ. సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు తమ జన్మ దినోత్సవాలు, వివాహ దినోత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. వేడుకలలో ఖర్చు చేయడం కన్నా అవసరం ఉన్నవారికి సహకారం అందించడం ద్వారా పదిమందికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నందకిషోర్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి సుధాకర్ రెడ్డి తో పాటు కార్యదర్శి సోమేశుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చంద్రమోహన్, సభ్యులు మేడా చంద్రశేఖర్,మణి మోహన్ రెడ్డి, లయన్స్ క్లబ్ యువజన విభాగం సభ్యురాలు రూప శ్రీ, జీవన జ్యోతి అంధుల పాఠశాల నిర్వాహకులు వలి బాష తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో బాబు పొత్తులు

- మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి

శిల్పా మోహన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం ప్రక్కన ఎమ్మెల్సీ ఇసాక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఓటమి భయంతోనే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జనసేన, బిజెపి పార్టీలతో కలిసి ఎన్నికలలో పోటీకి దిగారని మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని దేవ నగర్, వీసీ కాలనీ, శ్యామ్ నగర్‌ల నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవనగర్ బాషా, కౌన్సిలర్స్ చంద్ర శేఖర్, మాజీ కౌన్సిలర్‌లు జాకీర్ హుస్సేన్, దిలీప్ కుమార్ అధ్వర్యంలో యువకులు టీడీపీ నుండి వైసీపీలో చేరారు. వీరందరికీ మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్మోహన్ రెడ్డిని నంద్యాలలో శిల్పా రవి రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. నంద్యాలలో మెడికల్ కళాశాల, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవనాల ఆధునీకరణ, ఇళ్ల స్థలాలు తదితర అనేక అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చేశారన్నారు. నంద్యాల ప్రజలందరి ఆశీస్సులు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన శిల్పా రవిరెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నజీర్, వాసిం, సలీం, హరి,మున్న, వంశీ, ఫారుక్, శివ, వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు వైఎస్ఆర్సిపి అభిమానులు పాల్గొన్నారు.

వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న బీసీ జనార్ధన్ రెడ్డి

చిరు వ్యాపారులను ఆదుకునేందుకే తోపుడు బండ్లు పంపిణీ : మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

చిరు వ్యాపారుల జీవితాలలో వెలుగులు నింపడానికే తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ పంపిణీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సొంత నిధులతో పట్టణంలోని చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఉచిత పంపిణి చేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తోపుడు బండిపై జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు అయిన చిరు వ్యాపారుల జీవితాలలో వెలుగులు నింపడానికి మొదటి విడతగా 140 తోపుడు బండ్లు పంపిణీ చేశామని, మిగిలిన వారికి 3 రోజుల్లో రెండో విడతలో పంపిణీ చేస్తామని తెలిపారు. చిరు వ్యాపారులు మాట్లాడుతూ తోపుడు బండికి నెలకు దాదాపు రూ.2000 వరకు కట్టి కుటుంబ జీవనం సాగిస్తున్నామని బీసీ జనార్ధన్ రెడ్డి మా గురించి అలోచించి ఉచింతంగా తోపుడుబండి ఇవ్వడం తమ కుటుంబాలకు మేలు కలుగుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు బీసీ రామనాథరెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, టిడిపి నాయకులు అన్వర్ సాహెబ్, వార్డు మెంబర్ కలాం, అల్తాఫ్ హుస్సేన్ ,కార్పెంటర్ షబ్బీర్, గౌండ బాబు, గౌండ మహబూబ్ భాషా, టిడిపి నాయకులు, కార్యకర్తలు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మండల పరిధిలోని గడిగరేవుల, తిరుపాడు గ్రామాలలో రూ.కోటి పైచిలుకు నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. గత ఐదు సంవత్సరాలలో ప్రజలకు అందుబాటులో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు, నేరుగా పేద ప్రజలకు డీబీటీ ద్వారా ప్రజల అకౌంట్లో డబ్బులు జమ చేయడం దేశ చరిత్రలో కొత్త సంప్రదాయానికి సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశా రన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న మార్క్‌ఫెడ్ ద్వారా సంచులు అందుబాటులో లేవని,మండలంలో జొన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన అధికారులతో మాట్లాడి మండలంలో పూర్తిస్థాయిలో జొన్నలు కొనుగోలు చేయాలని, ప్రైవేట్ సంచులు అనుమతించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గడివేముల మండల వ్యాప్తంగా జొన్నలు రెండు, మూడు రోజుల్లో తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ జక్కుల సావిత్రి, సర్పంచ్ బిఎస్ రామ్మోహన్ రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ హుస్సేన్ బాష, ఉప సర్పంచ్ గోదాప్రసాద్, ఎల్లారెడ్డి, మాజీ చైర్మన్ రాచమల్లు గోపాలయ్యా, సొసైటీ చైర్మన్ పోగుల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బికె సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కేజీబీవీల్లో ఆన్లైన్ అడ్మిషన్లు స్వీకరణ కొలిమిగుండ్ల మండలంలోని కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్లకు ఆన్లైన్లో చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీ సరోజ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12 నుండి కేజీబీవీల్లో 6వ,11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 18004258599 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో వైసీపీ అరాచర పాలనకు రోజులు దగ్గర పడ్డాయని చాగలమర్రి నాలుగవ ఎంపీటీసీ ఇన్చార్జ్ జెట్టి నాగరాజు అన్నారు. శనివారం నాలుగవ ఎంపీటీసీ పరిధిలో ఆయన టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైసిపి కి ప్రజలు తగిన గుణపాఠం తెలుపుతారన్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న ఇన్చార్జ్ జెట్టి నాగరాజు

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులకు సర్పంచి తులసమ్మ, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్‌లు భూమి పూజ చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జలవనురుల ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు గడపగడపకు మన ప్రభుత్వం క్రింద నిధులు మంజూరు చేసారన్నారు. ఈ నిధులతో బుగ్గ వీధిలో ఖిజర్ ఇంటి నుంచి వాజీద్ ఇంటి వరకు,ఎస్సీ కాలనీలో రాజు ఇంటి నుంచి శ్రీరాములు ఇంటి వరకు,ఏసురత్నం ఇంటి నుంచి రాజన్న ఇంటి వరకు,అష్రాఫ్ నగర్‌లో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం ఇంటి నుంచి చాకలి నర్సమ్మ ఇంటివరకు రూ 20 లక్షలతో సిసి రోడ్లు,మురికి కాలువలను నిర్మించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కొండారెడ్డి, వైస్ ఎంపిపి రఫి,ఎంపీటీసీ ఫయాజ్,మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం , వైసీపీ నాయకులు ఖాధర్‌బాష,అబ్దులా,పెయింటర్ షరీఫ్,లాడెన్ మహబూబ్‌బాష,నారా ఓబులేసు,పెయింటర్ రఫి పాల్గొన్నారు.

భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

11న టిడిపి కార్యాలయం ప్రారంభం

- వై నాగేశ్వరరావు యాదవ్

ప్రజాశక్తి -ప్యాపిలి

ప్యాపిలి పట్టణంలో 11వ తేదీన టిడిపి మండల కార్యాలయంను డోన్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రారంభోత్సవం చేస్తున్న ట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర యాదవ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కోట్ల, కెఇ కుటుంబాలు పై ఓవర్ బ్రిడ్జి, తాగునీటి ప్రాజెక్టు, రోడ్లు మొదలైనవి అభివృద్ధి చేశారన్నారు. టిడిపి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలు, లోకేష్ బాబు శంఖారావం, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున మండల స్థాయిలో ఉన్న గ్రామ గ్రామల ప్రజలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, రామ్మో హన్ యాదవ్, చంద్రపల్లె వెంకట రమణ చారి, నాగేంద్ర,చిన్న పూజర్ల రమేష్ గౌడ్, చల్లా వీర, పోదొడ్డి పుల్లారెడ్డి,పోదొడ్డి నారా యణ,ప్రకాష్,కంపగిరి రాముడు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై నాగేశ్వరరావు యాదవ్

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పురపాలక సంఘం చైర్ పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా శనివారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో తనిఖీ చేశారు. హాస్పిటల్లోని పలు వార్డులను పరిసరాలను పరిశీలించారు. హాస్పటల్‌కు వస్తున్న పేషంట్ల వివరాలను సేవ వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చిన్నపిల్లల వార్డును, పేషెంట్లకు మందులు పంపిణీ చేసే గదిని పరిశీలించి, హాస్పిటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, తదితర అంశాలపై డాక్టర్లకు సూచించారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న చైర్మన్

హోరాహోరీగా ఎద్దుల బల ప్రదర్శన

ఒంగోలు జాతి ఎద్ల బల ప్రదర్శన ను ప్రారంభించిన శిల్ప భువనేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

మహానంది : మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఒంగోలు జాతి ఎద్ల బల ప్రదర్శనను శనివారం శ్రీశైలం సమన్వయకర్త శిల్పా భువ నేశ్వర్ రెడ్డి, శిల్పా కార్తీక్ రెడ్డిలు ముఖ్యఅతిదులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానంది క్షేత్రంలో నిర్వహించే ఎద్ల బల ప్రదర్శనకు మంచి గుర్తింపు ఉందని అన్నారు. ఇక్కడ పోటీలలో ఎద్ల వషభరాజ లు యజమానులు క్రికెట్లో ప్రపంచకప్ గెలిచినంతగా సంబరపడతారని అన్నారు. శనివారం నిర్వహించిన సీనియర్ విభాగంలో ఆరు ఎద్ల జతలు పాల్గొనగా అందులో ఎస్ఎస్ బుల్స్ కూకట్పల్లి తెలంగాణ సజ్జల హర్ష చౌదరి వారి ఎద్ల జత 2221 అడుగుల దూరాన్ని బండను లాగి ప్రథమ బహుమతి గెలుచుకున్నాయని అన్నారు. అలాగే డివిఆర్ మెమోరియల్ కృష్ణాజిల్లా వారి జత 2208 అడుగుల దూరాన్ని లాగి రెండవ బహుమతిని సాధించాయని తెలిపారు. బాగా డివిఆర్ జత గత మూడు సంవత్సర నుండి వరుసగా మహానందిలో గెలుస్తున్న ఈ జతను ఓడించిన ఎస్ఎస్ బుల్స్ వారు నాలుగో సారి గెలిచే అవకాశాన్ని లేకుండా ప్రథమ స్థానాన్ని సాధించడం విశేషం. **గడివేముల :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలో వెలిసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శనను నిర్వహించారు. శనివారం జరిగిన నాలుగు పండ్ల లోపు విభాగంలో మొదటి బహుమతి భూమా గోవర్ధన్ రెడ్డి, బిల్లాలాపురం 30 వేల రూపాయలు, రెండవ బహుమతి రామ సుబ్బారెడ్డి పోలూరు 20000 రూపాయలు, మూడో బహుమతి దండు నరసింహులు కొణిదెల 15000, నాలుగో బహుమతి పా గుంటన్న గద్వాల పదివేల రూపాయలు, ఐదవ బహుమతి ఆంజనేయులు గద్వాల 8000 రూపాయలు ,ఆరవ బహుమతి మద్దిలేటి బోయినపల్లి 7000 రూపాయలు ,ఏడవ బహుమతి కృతిక మర్రిపల్లి ఆరువేల రూపాయలు, ఎనిమిదవ బహుమతి రామకృష్ణ గద్వాల 5000 రూపాయలు చెందిన వృషభలు గెలుపొందాయి. గెలుపొ ందిన విజేతలకు ఆలయ చైర్మన్ ఐసాని సునీల్ కుమార్ రెడ్డి, దాతలు శాంతిరాం విద్యాసంస్థల అధినేత మిద్దె శివరాం ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. **బండి ఆత్మకూర్ :** మహాశివరాత్రి పండగ సందర్భంగా ఓంకారం, శివ నంది, విష్ణు నంది, పుణ్యక్షేత్ర ముల నందు హోరాహోరీగా జరుగుతున్న ఎద్దుల బల ప్రదర్శన పోటీలను వైసిపి యువ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఎద్దుల బలప్రదర్శన పోటీలను శనివారం ప్రారంభించారు. శివనంద క్షేత్రంలో రాగాల బ్రదర్స్ మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు రాగల వెంకటరమణ, వైసిపి యువ నాయకుడు రాగాల బాబుల్, ఆంధ్రప్రదేశ్ ఏపీ సిడిపి ఎల్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ వైకాపా మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శశికళ రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించగా విష్ణు నంది పుణ్యక్షేత్రం నందు వైకాపా నాయకుడు పల్లె సోమశేఖర్ రెడ్డి, పల్లె ఆదిలక్ష్మి రెడ్డి, బా రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. రైతులు, భక్తులు ఉత్సాహంగా ఈ పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో వైకాపా కన్వీనర్ బా రెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షుడు ముడుమేల పుల్లారెడ్డి, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

గడివేముల : విజేతలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

బండి ఆత్మకూర్ : పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

అన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి శ్రీశైలం : దేవస్థానం భక్తుల కోసం ఏర్పాటుచేసిన శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళంను కడప చెందిన బి, సత్యనారాయణ రూ.1,00,116, బి. విష్ణువర్ధన్, రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణిధర ప్రసాద్, పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు.

2024 మరియు 25 సంవత్సరములకు గాను

రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ మదర్ ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలో లంబాడి సుగాలి యానాది ఏరుకుల చెంచు ఎస్టి విద్యార్థులకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు హాస్టల్‌తో ఉచిత విద్య త్వరపడండి. తీసుకొని రావలసిన సర్టిఫికెట్స్ క్యాస్ట్ మరియు ఇన్కమ్ విద్యార్థి ఆధార్ తల్లి ఆధార్ తండ్రి ఆధార్ విద్యార్థి చదువుతున్న పాఠశాల నుండి స్టడీ సర్టిఫికేట్ బియ్యం కార్డ్ తీసుకొని రావలసి ఉంటుంది.

వివరములకు :
బాలచంద్ర సమత విద్యానికేతన్ టెక్కె నంద్యాల.
సెల్ : 9398837182

పత్రిక ప్రకటన

సమస్త ప్రజానీకమునకు తెలియజేయడం ఏమనగా నా క్లైయింట్ M/S శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటేడ్‌వారు BOBBALA JAGADESHWAR REDDY S/O B.NAGESHWAR REDDY, వారికి ఇచ్చు LOAN వ్యవహారంలో తనపై గల ఆస్తిని తనఖా పెటుటకు అంగీకరించెను కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా క్లైయిమ్‌లు గాని లేదా ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ తేదీ నుంచి 10-03-2024 నుండి 16-03-2024 వరకు మాఆఫీసు నందు గాని లేదా మాక్లైయింట్ ఆఫీసు నందు గాని తెలియజేయగలరు.

SCHEDULE OF THE PROPERTY

The plot No.14,15,16,17,18 in sy.no.417 & 800 total extent of 666.65 sq yards situated at Nandikoturu muncipality nandikoturu Town area 15th ward new Hospital Road Residential area. Nandikotkur, Nandyal Dist

Plot No.14 Boundaries:
East:plot No.10
West: 30 feet road
North:plot no.12,13
South:plot no.15

Plot No.15 Boundaries:
East:plot No.9
West: 30 feet road
North:plot No.14
South:plot no.16

Plot No.16 Boundaries:
East:plot No.8
West: 30 feet road
North:plot no.15
South:plot no.17

Plot No.17 Boundaries:
East:plot No.7
West: 30 feet road
North:plot no.6
South:plot no.8

Plot No.18 Boundaries:
East:plot No.6
West: 30 feet road
North:plot no.17
South:open place

ADVOCATE,
B.SATYANARAYANA
cell no:9440776007

పత్రిక ప్రకటన

సమస్త ప్రజానీకమునకు తెలియజేయడం ఏమనగా నా క్లైయింట్ M/S శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటేడ్‌వారు BOBBALA NAGESHWAR REDDY S/O B.VEERA REDDY, వారికి ఇచ్చు LOAN వ్యవహారంలో తనపై గల ఆస్తిని తనఖా పెటుటకు అంగీకరించెను కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా క్లైయిమ్‌లు గాని లేదా ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ తేదీ నుంచి 10-03-2024 నుండి 16-03-2024 వరకు మాఆఫీసు నందు గాని లేదా మాక్లైయింట్ ఆఫీసు నందు గాని తెలియజేయగలరు.

SCHEDULE OF THE PROPERTY

The plot No.1,2,3,4,5,5a in sy.no.417 & 800 total extent of 799.98 sqhave yards situated at Nandikoturu muncipality nandikoturu Town area 15th ward new Hospital Road Residential area. Nandikotkur,Nandyal Dist

Plot No.1 Boundaries:
East: Others place
West: 30 feet road
North:open place
South:plot no.2

Plot No.2 Boundaries:
East: Others place
West: 30 feet road
North:plot no.1
South:plot no.3

Plot No.3 Boundaries:
East: Others place
West: 30 feet road
North:plot no.2
South:plot no.4

Plot No.4 Boundaries:
East: Others place
West: 30 feet road
North:plot no.3
South:plot no.5

Plot No.5 Boundaries:
East: Others place
West: 30 feet road
North:plot no.4
South:plot no.5a

Plot No.5a Boundaries:
East: Others place
West: 30 feet road
North:plot no.5
South:others place

ADVOCATE,
B.SATYANARAYANA
cell no:9440776007

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్. నెంబర్ 07/2023

గుండం రమణారెడ్డి. ...వాది

ఎదురి

టి.నారాయణరెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

వాది తన ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తము ప్రతివాది పైన కోర్టులో పై నెంబర్ దావ దాఖలు చేసి ఉన్నాడు. సదరు దావా నందు కోర్టు వారు ప్రతివాదికి పంపిన దావా సమన్లు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా 27-03-2024వ తేదీన నీవు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై పై దావాలో నీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల కోర్టు వారు దావాను మీ పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా 27-03-2024

ప్రతివాది చిరునామా :
టి.నారాయణ రెడ్డి తండ్రి టి.నాగిరెడ్డి
ఇంటి నెంబర్ 16/46-1a,
సుబ్బారావు పేట, నందికొట్కూరు పట్టణం,
నంద్యాల జిల్లా

(కోర్టు వారి ఉత్తరువు మేరకు)

జె.వెంకటరాముడు,
వాది పరం వకీలు,
నందికొట్కూరు టౌను,
సెల్ నెంబర్ : 9959415237

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రమాదవశాత్తు నీళ్ల ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తా పడి బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ జయంత్ కుమార్ ముఖ్య (26) మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. కొలిమిగుండ్ల నుంచి హైదరాబాదు వరకు సోలార్ పవర్ 765 కెవి విద్యుత్తు టవర్ల నిర్మాణాన్ని స్కిప్పర్ కంపెనీ చేపట్టింది. విద్యుత్తు టవర్ల నిర్మాణం ప్యాచ్ వర్క్ మండల పరిధిలో 20 టవర్ల నిర్మాణాన్ని సబ్ కాంట్రాక్టర్ అమిత్ కుమార్‌కు అప్పచెప్పారు. టవర్ల నిర్మాణానికి బీహార్ రాష్ట్రం నుంచి 20 మందిని కూలీలను తీసుకొచ్చారు. అశోక్ పొలంలో విద్యుత్తు టవర్ల ఏర్పాటుకు నిర్మించిన సిమెంట్ దిమ్మెలను క్యూరింగ్ చేసేందుకు జయంత్ కుమార్ ముఖియ ట్రాక్టర్ నీళ్ల ట్యాంకర్‌ను తీసుకెళ్లారు. సిమెంట్ దిమ్మలని క్యూరింగ్ చేసి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో భారీ మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పోల్తాపడింది. జయంత్ కుమార్ ముఖియా తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రహదారి వెంట వెళుతున్న పాఠశాలలు అధి గమనించి ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సబ్ కాంట్రాక్టర్ అమిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయ శేఖర్ తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, చిత్రంలో బోల్తా పడ్డ ట్రాక్టర్

వైభవంగా మహానందీశ్వరుని కళ్యాణం

5వ పేజీ తరువాయి..

గడివేముల ఎస్సై బీటీ వెంకటసుబ్బయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలో వెలసిన ఏడు ఊర్ల గవి ఆల యంలో గని ప్రతాపరెడ్డి బొల్లవరం బాబుల్ రెడ్డిఆధ్వర్యంలో స్వామివారికి కళ్యాణ మహోత్సవం కనుల పండగ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గ్రామం మొత్తం పురవీధుల గుండా తిప్పుతూ బానసంచ పేలుస్తూ భక్తులు పాల్గొని కళ్యాణ మూర్తులను దర్శించుకున్నారు. **రుద్రవరం :** రుద్రవరం సమీపంలో వెలిసిన శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన, ధూప దీప నైవేద్యాలతో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి నంద్యాల జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన వందలాది మంది భక్తులకు దాతలు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా యాగంటి ఉమామహేశ్వరుల కళ్యాణం

బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీఉమామహేశ్వర దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున ఉమామహేశ్వర కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు లింగోద్భవకాల ప్రత్యేక పూజల్లో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, పాల్గొన్నారు. ప్రత్యేక కళ్యాణవేదిక వద్ద శ్రీ ఉమామహేశ్వరస్వామి వార్ల ఉత్సవవిగ్రహాలను కొలువు దీర్చి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అంత్యంత వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మలు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన నందికొల మొహత్సవం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వ ర్యంలో ప్రత్యేక వసతులను కల్పించారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు శ్రీ ఉమామహేశ్వర నిత్య అన్నదాన సంస్థ రైతు అన్నదాన సంస్థ ఆర్యవైశ్య అన్నదాన సంస్థ బ్రాహ్మణ అన్నదాన సంస్థ యాదవ అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవస్థానంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగ కుండా సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ రామిరెడ్డి పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు .

లింగోద్భవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

పాణ్యంలో..

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దంపతులు